సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం : 31 : జూలై : 2025



సాగర్‌లో పర్యాటకుల సందడి
నాగార్జునసాగర్‌లోపాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో పర్యాటకులు తరలివస్తున్నారు. - 8లో



భయపెడుతున్న బడి
దత్తప్పగూడెం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది.నూతన భవనం నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. - 9లో



లో ఓల్టేజీ సమస్య
భువనగిరిలోని 13వ వార్డు ఓంకార్‌నగర్‌లో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు గురుకుల కళాశాలల కో ఆర్డినేటర్ జగదీశ్వర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి, రాజాపేట, మోత్కూర్(బాలుర), బీబీనగర్, చౌటుప్పల్, అడ్డగూడూరు(బాలికల)లోని కళాశాలల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. పదో తరగతిలో 420 మార్కులకు పైబడి ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు రిజినల్ సర్టిఫికెట్లతో ఆయా కళాశాలల్లో సకాలంలో హాజరు కావాలని కోరారు.

స్వర్ణగిరీశుడికి పాదపద్మార్చన సేవ



అష్టదళ పాదపద్మార్చన సేవ నిర్వహించి హారతినిస్తున్న అర్చకుడు

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అష్టదళ పాదపద్మార్చన సేవను అర్చకులు వైభవంగా నిర్వహించారు. 108 బంగారు అష్టదళ పద్మ పుష్పాలు, అష్టోత్తర శతనామాలతో సేవ చేపట్టారు. ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, సహస్ర నామార్చన, నిత్యకల్యాణం, శ్రావణమాసం సందర్భంగా పద్మావతి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవసేవ, అమ్మవారికి కుంకుమార్చన సేవ జరిపించారు.

వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన

భువనగిరి: మండలంలోని బోల్లేపల్లి పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణంలో మార్పుల వల్ల ఆరోగ్యంపై చూపే ప్రభావం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సంస్థ బృందం సభ్యులు రాజశేఖర్, నిఖిల, శ్రద్ధా సంపత్, హర్షిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత పథకాలతో భరోసా



సదస్సులో మాట్లాడుతున్న చిన్మయ్‌కుమార్

బొమ్మలరామారం : కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు అందించే సామాజిక భద్రత పథకాలు వారి కుటుంబాలకు భరోసాగా నిలుస్తాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్‌కుమార్ తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారం, కెనరా బ్యాంక్ సౌజన్యంతో జిల్లా లీడ్ బ్యాంక్, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరెన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, జన సురక్ష, బీమా పథకాలపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.ఆర్థిక క్రమశిక్షణతో క్రెడిట్ స్కోర్ పెంచుకొని బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ సుప్రభాత్, ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ కృష్ణ శర్మ, ఎస్‌బీఐ ఏజీఎం సతీష్, టీజీబీ ఆర్ఎం ఆశలత, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ, ఎస్సీ,ఎస్టీ సీఎఫ్ఎల్ పీడీ అంజనేయులు, అడిషనల్ డీఆర్‌డీఓ జంగారెడ్డి, డీపీఎం ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ గూడే బాల్ నర్సింహ, ఎంపీడీహో రాజా త్రివిక్రమ్, ఏపీఎం రమణ పాల్గొన్నారు.

పలకని సరిగమలు!

పాఠశాలలకు 'పీఎంశ్రీ' ద్వారా మ్యూజిక్ పరికరాలు
- మూడు నెలల క్రితమే పంపిణీ
- నేటికీ ప్రత్యేక టీచర్లను నియమించని ప్రభుత్వం
- నిరుపయోగంగా సంగీత, వాయిద్య పరికరాలు



సంస్థాన్‌నారాయణపురం మోడల్ స్కూల్‌లో నిరుపయోగంగా సంగీతం, వాయిద్య పరికరాలు



ఆలేరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో వృథాగా సంగీతం, వాయిద్య పరికరాలు

సాక్షి,యాదాద్రి: విద్యార్థుల్లో కళల పట్ల ఆసక్తి పెంపొందించే లక్ష్యంతో పీఎం శ్రీ పథకం కింద పాఠశాలలకు మంజూరు చేసిన సంగీత పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇవి మూడు నెలల క్రితం పాఠశాలలకు చేరినా ఉపయోగంలోకి తీసుకురావడం లేదు. వీటిపై అవగాహన కలిగిన ఉపాధ్యాయులను నియమించకపోవడంతో మూలనపడ్డాయి. కొన్ని పాఠశాలల్లో వాయిద్య పరికరాలున్న డబ్బాలను సీల్ కూడా తీయలేదు.

ఏడు పాఠశాలలు ఎంపిక

పీఎం శ్రీ పథకానికి 17 ప్రభుత్వ ఉన్నత, గురుకుల పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలల్లో ల్యాబ్‌లు, క్రీడా పరికరాలు, కంప్యూటర్లు, ట్యాబ్స్, గ్రంథాలయాలు మొదలైన సౌకర్యాలు కల్పించారు. కాగా విద్యార్థులకు సంగీత వాయిద్యాలపై అవగాహన కల్పించడానికి ఏడు పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో టీఎస్ఎంఎస్ గుండాల, సంస్థాన్ నారాయణపురం, ఎం.తుర్కపల్లి టీఎస్ఎంఎస్, చౌటుప్పల్‌లోని టీఎస్ఆర్ఈఐఎస్, భూదాన్‌పోచంపల్లి టీఎస్ఎంఎస్, ఆలేరు జెడ్పీహెచ్ఎస్, భువనగిరిలోని టీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్ బాలుర పాఠశాల ఉన్నాయి. ఆయా పాఠశాలలకు సంగీత పరికరాలు డోలక్, తబలా, వయోలిన్, హార్మోనియం మొత్తం నాలుగు రకాల పరికరాలను సరఫరా చేశారు. వీటిపై విద్యార్థులకు బేసిక్ పాఠాలు నేర్పాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

ప్రతి పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు అవసరం

ఎంపిక చేసిన ఏడు పాఠశాలలకు మే మొదటి వారంలోనే సంగీత పరికరాలు వచ్చాయి. కానీ, వీటికి సంబంధించి బోధన చేసేందుకు విద్వాంసులను నియమించలేదు. డోలక్, తబలా, వయోలిన్, హార్మోనియం వాయించేందుకు మాస్టర్లు అవసరం ఉన్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వాయిద్యకారులు దాదాపు లేనట్లే. ఎవరైనా ఉపాధ్యాయులకు వాయిద్యాలపై ప్రాథమిక అవగాహన ఉంటే వారిచేత పిల్లలకు నేర్పించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇచ్చిన పరికరాల ఎలా వాడాలో నేర్పించడానికి ప్రతిపాఠశాలకు కనీసం ముగ్గురు విద్వాంసులు అవసరం. వీరిని ఎలా నియామకం చేయాలనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులు మాత్రం సంగీత, వాయిద్య పరికరాలను చూస్తూ ఎప్పుడు నేర్పిస్తారన్న ఆతృతతో ఉన్నారు. అంతేకాకుండా పరికరాలను భద్రపర్చడం కూడా ఇబ్బందిగా మారింది. కొన్ని చోట్ల ఎలుకలు కొరికి పాడు చేస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మాస్టర్లను నియమించలేదు

విద్యార్థులకు చదువుతో పాటు సంగీతంపై అభిరుచి కల్పించాలని పీఎం శ్రీ పథకం కింద విద్యాశాఖ సంగీత పరికరాలు అందజేసింది. ఆయా రంగాల్లో విద్యార్థి దశనుంచే రాణించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మాస్టర్‌లను నియమించాల్సి ఉంది. నియామకం పూర్తికాగానే విద్యార్థులకు శిక్షణ ప్రారభిస్తాం.

– శోభారాణి, ప్రిన్సిపాల్, తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, తుర్కపల్లి

పరికరాలున్నా ఉపయోగం లేదు

పీఎం శ్రీ పథకం కింద సంగీత, వాయిద్య పరికరాలు వచ్చాయి. అయితే అందుకు సంబంధించిన ప్రత్యేక టీచర్ లేకపోవడంతో వాటిని వినియోగించడం లేదు. ప్రస్తుతం ఉన్న మ్యూజిక్ టీచర్‌తో పరికరాలను వినియోగించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించలేకపోతున్నారు.

– స్మిత, ప్రిన్సిపాల్, బాలికల గురుకుల పాఠశాల, చౌటుప్పల్

బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించాలి

- కలెక్టర్ హనుమంతరావు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని, వారి వివరాలను అధికారులకు సమర్పించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బుధవారం తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 257 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి పరిధిలో పురుషులు 1,09,820, మహిళా ఓటర్లు 1,12,830, ఇతరులు ఒక్కరు చొప్పున ఉన్నారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో పురుషులు 1,18,297, మహిళా ఓటర్లు 1,19,931, ఇతరులు 20 మంది ఉన్నట్లు వెల్లడించారు. నూతన ఓటరు నమోదులో భాగంగా ఈ ఏడాది జనవరి 1నుంచి ఈనెల 30వ తేదీ వరకు 15,689 దరఖాస్తులు స్వీకరించగా, అందులో 9,106 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. 5,397 తిరస్కరణకు గురయ్యాయని, 1,186 దరఖాస్తులు విచారణలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన కొనసాగుతుంది

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్నట్లు అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అదనపు కలెక్టర్ల(రెవెన్యూ)తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా వెరిఫికేషన్, ఎన్నికల ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా తొలగింపులు, బదిలీ, ఫొటో మార్పిడి తదితర వాటిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లు, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, ఎన్నికల సూపరింటెండెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు ప్రభుత్వ వైఫల్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మోత్కూరు: తెలంగాణ ఉద్యమ తరహాలో ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్లాలని రమాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మోత్కూరు, అడ్డగూడూరు మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం బుధవారం మోత్కూరు మండలంలోని పాటిమట్లలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు ద్రోహం చేసే వారిని సర్కస్ ఆట ఆడటమే తన లక్ష్యమన్నారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి చేతకాని మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. యాదాద్రి, సూర్యాపేట జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోయిందన్నారు. అన్నింటిలో వైఫల్యం చెందిన కాంగ్రెస్‌ను.. స్థానిక సంస్థలలో ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించడానికే సీఎం రేవంత్‌రెడ్డి పొద్దస్తమానం కేసీఆర్‌ను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరత నెలకొని రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల వేధింపులు అధికమయ్యాయని, మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు మారుతాయని, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ ఒంటెద్దు నర్సింహారెడ్డి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన సాగు నీటి ప్రాజెక్టులు, కాల్వలు, సాగు నటి విడుదలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారంపై ప్రొజెక్టర్ ద్వారా పార్టీ శ్రేణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల రామకృష్ణారెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, మోత్కూరు, అడ్డగూడూరు మండల పార్టీ అధ్యక్షుడు పొన్న బోయిన రమేష్, కె.ప్రభాకర్‌రెడ్డి, మండల కార్యదర్శులు సీహెచ్ సత్యం గౌడ్, గిరగాని శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు జంగ శ్రీను, కార్యదర్శి గజ్జి మల్లేషం, నాయకులు పాల్గొన్నారు.

యూటర్న్‌ల వద్ద బోలోర్స్



ఆరెగూడెం యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన బోలోర్స్

- జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు
- ఆరెగూడెం, పంతంగి, కైతాపురం వద్ద బోలోర్స్, సూచికలు ఏర్పాటు

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు రాచకొండ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నెల 26న చౌటుప్పల్ మండలం కైతాపురం స్టేజీ వద్ద జరిగిన ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు డీఎస్పీలు మృతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో చౌటుప్పల్ మండలం రెడ్డిబాయి గ్రామ స్టేజీ నుంచి తుఫ్రాన్‌పేట వరకు జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రాంతాలను పోలీసులు క్షేత్ర పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఎక్కువగా తెల్లవారుజామున, గ్రామాల స్టేజీల వద్ద ప్రమాదాలు జరుగుతుండడంతో యూటర్న్‌ల వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఆరెగూడెం, పంతంగి, కైతాపురం యూటర్న్‌ల వద్ద బోలోర్స్ ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో వాహనదారులకు కనిపించేలా వాటిని ఏర్పాటు చేసినట్లు చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్ తెలిపారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కొణతం జానిరెడ్డి ఆదేశించారు. బుధవారం మిర్యాలగూడలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆదాయం, అక్యుపెన్సీ రేట్ పెంచాలని సూచించారు. ఆర్టీసీ ప్రతిష్టను కాపాడుకునే విధంగా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రయాణికులతో గౌరవంగా మెలగాలని పేర్కొన్నారు. టూరిజం ప్యాకేజీలు ప్రజల్లోకి వెళ్లేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, టీఐ–3 పుట్ట వైష్ణవి, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.



మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఆర్ఎం

చదువుతోనే ఉన్నత స్థానాలకు

- ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం



మల్లేశంను సన్మానిస్తున్నఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం తదితరులు

బొమ్మలరామారం : మెరుగైన సమాజ నిర్మాణంలో కీలక భూ మిక పోషించే ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం చీకటిమామిడిలో తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ యూపీఎస్ స్కూల్ అసిస్టెంట్ ఇటికాల మల్లేశం ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులతోనే మెరుగైన ఫలితాలు సాధ్యమన్నారు. విద్య ఒక్కటే అణగారిన వర్గాలను ఉన్నత స్థానాలకు చేరుస్తుందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం తన సామాజిక సేవలు మరింత విస్తరింపజేస్తానని మల్లేశం ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రజా ప్రతినిధులు మల్లేశం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రిటైర్డ్ రైల్వే అధికారి అప్పికట్ల భరత్ భూషన్, రచయిత పసునూరి రవీందర్, గాయకులు వరంగల్ రవి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర్ల యాదయ్య, మెతుకు సైదులు, ఎంఈఓ రోజారాణి, సీహెచ్ లక్ష్మి, గంగరాజు సిద్ధులు, పెద్ది భిక్షమయ్య, నిర్మల జ్యోతి, గిరిధర్ రెడ్డి, ఋషి, రాజ్‌కుమార్, గోపాల్‌దాస్ పాల్గొన్నారు.

కళాశాల దూరం.. చదువులు భారం!

రాజాపేటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేక ఇబ్బందులు
- భువనగిరి, గుట్ట, ఆలేరు, పొరుగు జిల్లాకు పోతున్న విద్యార్థులు
- అంతదూరం వెళ్లలేక కొందరు మధ్యలోనే చదువుకు స్వస్తి
- నెరవేరని నేతల హామీలు



రాజాపేట నుంచి ఆర్టీసీ బస్సుకు కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు

రాజాపేట : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తారని, తమ ఇబ్బందులు తీరుతాయని విద్యార్థులు ఏళ్లకాలంగా ఎదురుచూస్తున్నా వారికి నిరాశే మిగిలింది. కళాశాల అందుబాటులో లేక, దూరప్రాంతం వెళ్లలేక కొందరు పదో తరగతిలోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. మండలంలో ఏటా 500 మంది వరకు పదో తరగతి పూర్తి చేస్తుంటారు. ఆ తరువాత ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి వృత్తివిద్యా కోర్సుల్లో చేరుతున్నారు. వారంతా రోజూ 40 కిలో మీటర్ల దూరం రాకపోకలు సాగిస్తున్నారు. యాదగిరిగుట్ట, భువనగిరి, ఆలేరుతో పాటు పొరుగు జిల్లాలైన జనగామ, చేర్యాల, జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్, గజ్వేల్, సిద్దిపేటకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి నెలకొంది. 15 గ్రామాలకు కూడలిగా ఉన్న రాజాపేటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రజాప్రతినిధులు, అధికారులకు ఏళ్లుగా విన్నవించుకుంటున్న ప్రజలు

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు ప్రజలు పలుమార్లు విన్నవించినా స్పందనలేదు. విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. కళాశాల ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో నేతలు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆడపిల్లలను దూరప్రాంతాలకు పంపించి చదివించలేక, హాస్టల్లో ఉంచి డబ్బులు వెచ్చించలేక చదువు మాన్పిస్తున్నారు. ఆర్థికస్తోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలను దూరప్రాంతానికి పంపించి చదివించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో అనువైన ప్రభుత్వ భవనాలున్నాయని, వాటిలో కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోజూ యాదగిరిగుట్టకు వెళ్తొస్తా



మండల కేంద్రంలో కళాశాల లేకపోవడంతో చాలా ఇబ్బందుల ఎదరవుతున్నాయి. గతంలో ప్రైవేట్ కళాశాల ఉండగా మూతపడింది. యాదగిరిగుట్టలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రోజూ బస్సుకు వెళ్లి వస్తున్నా. రాజాపేటతో పాటు మండలంలోని ఇతర గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు 20నుంచి 40 కిలోమీటర్ల వరకు కళాశాలలకు వెళ్లి వస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

– సాయిరోహిత్, విద్యార్థి, రాజాపేట

పేద కుటుంబాలకు ఇబ్బందిగా ఉంది



రాజాపేటలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేస్తే మాలాంటి నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఉన్నత చదువులు చదివించాలంటే నిత్యం పరిసర ప్రాంతాల్లోని యాదగిరిగుట్ట, భువనగిరి, ఆలేరు, గజ్వేల్, సిద్దిపేట వంటి ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తుంది. కళాశాలకు అనువైన ఎన్నో ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

– కరుణాకర్, విద్యార్థి తండ్రి, కుర్రారం

అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు

గుండాల: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ తెల్లరేషన్ కార్డు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. బుధవారం గుండాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతరావుతో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందాలంటే తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి ఏ ఒక్కరికీ రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలు ఉండ వద్దని చెప్పారు. ఇళ్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.2 లక్షల రుణం ఇప్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం బాండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ నూనెముంతల విమల, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ దేవేందర్‌రావు, నాయకులు ఇమ్మడి దశరథ గుప్తా, దార సైదులు, నూనెముంత వెంకటేశ్వర్లు, ద్యాప కృష్ణారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

కనులపండువగా జోడు సేవోత్సవం



జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలో భాగంగా స్వామి, అమ్మవారి జోడు సేవోత్సవం కనుల పండువ నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, సహస్రనామార్చన చేశారు. ఇక ఉత్తర ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో అష్టోత్తరం తదిర పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించి ఆలయ ద్వారబంధనం చేశారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనంలో నుంచి నగదు చోరీ

కొండమల్లేపల్లి: ద్విచక్ర వాహనం డిక్కీలో నుంచి నగదును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండకు చెందిన ముదిగొండ రాము తన ద్విచక్ర వాహనంపై కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో గల నాగార్జున గ్రామర్ హైస్కూల్‌లో ఉన్న తన మిత్రుడి కలిసేందుకు వచ్చాడు. పాఠశాల లోపలికి వెళ్లి ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి మిత్రుడితో మాట్లాడేందుకు వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తి ద్విచ్రక వాహనం డిక్కీలో దాచిన రూ.1.93లక్షల నగదును అపహరించాడు. ఈ దృశ్యాలు పాఠశాలలోని సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

తిప్పర్తి: తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నాయిగూడెం గ్రామంలో బుధవారం తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. చిన్నాయిగూడేనికి చెందిన బైరగోని సతీష్ బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలం నాటు వేయడానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా.. రూ.30వేల నగదు, తులంన్నర బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. వ్యక్తి మృతి



ఆంజనేయచారి (ఫైల్)

కొండమల్లేపల్లి: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం బాపూజీనగర్ వద్ద బుధవారం జరిగింది. వివరాలు.. దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన దమ్మోజు ఆంజనేయచారి (37) బుధవారం కొండమల్లేపల్లి పట్టణంలోని తమ బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ వద్ద 167వ నంబర్ జాతీయ రహదారిపై యూటర్న్ వద్ద ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయచారిని 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అక్క ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

ప్రయాణికుల ఫిర్యాదులను పరిష్కరించాలి

- ఆర్టీసీ ఆర్‌ఎం కొణతం జానిరెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌ఎం జానిరెడ్డి

మిర్యాలగూడ టౌన్: ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కొణతం జానిరెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని ఆర్టీసీ డిపోలో ఆయన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిలోమీటర్ల రాబడి, ఆక్యుపెన్సీ రేట్‌ను పెంచాలన్నారు. ఆర్టీసీ ప్రతిష్ఠను కాపాడుకునే విధంగా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఆర్టీసీ సిబ్బందితో పాటు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. టూరిజం ప్యాకేజీలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేలా చూడాలన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, టీఐ-3 పుట్ట వైష్ణవి తదితరులు ఉన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



సాగర్ ప్రాజెక్టు ముందు సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు



సాగర్ ప్రాజెక్టు వద్ద కిక్కిరిసిన పర్యాటకులు

- కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు
- సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపిన పర్యాటకులు
- చిరు వ్యాపారులకు పెరిగిన గిరాకీ

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో పర్యాటకులు క్యూ కట్టారు. సాగర్ అందాలను పర్యాటకులు తమ సెల్‌ఫోన్‌లలో బంధిస్తూ, సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం వద్ద, కొత్త బ్రిడ్జిపై పర్యాటకులు కిటకిటలాడారు. పర్యాటకుల రాకతో సాగర్ తీరంలో చిరువ్యాపారులు బత్తాయి జ్యూస్, ఐస్ క్రీమ్, మొక్కజొన్న కంకులు, చిప్స్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు అమ్ముకుంటూ ఉపాధి పొందుతున్నారు.

డౌన్ పార్కుకు మారిన లాంచీ స్టేషన్..

లాంచీ స్టేషన్ విజయవిహార్ నుంచి డౌన్ పార్కుకు మార్చారు. గతంలో డౌన్ పార్కు వద్దే లాంచీ స్టేషన్ ఉండగా.. ఇక్కడ వాహనాలు నిలిపేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో విజయవిహార్ వెనుక భాగంలో నూతనంగా నిర్మించిన లాంచీ జట్టీ నుండే లాంచీలను నడుపుతూ విజయవిహార్‌లో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లాంచీ స్టేషన్ డౌన్ పార్కుకే మార్చడంతో పర్యాటకులు ఆగకుండా వెంటనే లాంచీ ఎక్కి వెళ్లేందుకు కొంత అనువుగా ఉంది. ఈ సీజన్ పూర్తయ్యే వరకు ఇక్కడి నుండే లాంచీలను నడపనున్నారు.



మొక్కజొన్న కండెలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

కొత్త బ్రిడ్జిపై ట్రాఫిక్‌జాం



ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో బ్రిడ్జిపై ట్రాఫిక్ జాం

బుధవారం సాయంత్రం పర్యాటకుల వాహనాలు ఒక్కసారిగా ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని కొత్త బ్రిడ్జి పైకి రావడంతో ఎదురుగా వచ్చిన లారీ ఆగిపోయింది. దీంతో ట్రాఫిక్‌జాం అయ్యింది. పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వంతెనపై వాహనాలు వరుస క్రమంలో వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. కొత్త బ్రిడ్జిపై పర్యాటకులు వాహనాలు నిలుపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా దయ్యాలగండి వద్ద గల పుష్కర ఘాట్ సమీపంలో పర్యాటకులు రోడ్డు వెంట వాహనాలు నిలిపి సాగర్ జలాశయంలోకి దిగుతున్నారు. అక్కడ పోలీసు పహారా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

చిన్నారిని కిడ్నాప్ చేసేందుకు యత్నం

- పక్కింటి మహిళ కేకలు వేయడంతో బైక్‌పై పరారైన గుర్తుతెలియని వ్యక్తులు
- ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామంలో ఘటన



అశ్విక

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత సూర్యాపేట గ్రామానికి చెందిన నారబోయిన మహేష్ కుమార్తె అశ్విక సూర్యాపేట పట్టణంలోని కాకతీయ స్కూల్‌లో నర్సరీ చదువుతోంది. బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన అశ్విక కొద్దిసేపటికి తర్వాత తోటి పిల్లలతో ఆడుకునేందుకు ఇంటి బయటకు వచ్చింది. అదే సమయంలో బైక్‌పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి అశ్వికను కిడ్నాప్ చేసేందుకు గాను ఆమెను ఎత్తుకున్నారు. అదే సమయంలో పక్కింటికి చెందిన గాజాని భాను చూసి 'ఎవరు మీరు.. పాపని తీసుకెళ్తున్నారు' గట్టిగా అడగడంతో పాపను అక్కడే వదిలేసి పరారయ్యారు. తాను బయటకు వచ్చేలోగా దుండగులు పరారైనట్లు భాను భర్త హరీష్ తెలిపారు.

అనుమానాస్పద మృతి కాదు.. యువతిది హత్యే

- ఆమె ప్రియుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ సైదులు

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన యువతిది హత్యేనని నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ వై. సైదులు పేర్కొన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం దోరెపల్లి గ్రామానికి చెందిన సిర్పంగి శ్రీలత నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుంది. మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన జాల నాగరాజు మరో ప్రైవేట్ ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. గత మూడు సంవత్సరాలుగా వీరు ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమ విషయం శ్రీలత ఇంట్లో తెలియడంతో వారి వివాహానికి అంగీకరించారు. కానీ నాగరాజు ఇంట్లో వివాహానికి ఒప్పుకోకపోవడంతో సంవత్సర కాలంగా వివాహాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. మంగళవారం శ్రీలత నల్లగొండ పట్టణంలో నాగరాజు ఉంటున్న రూంకు వెళ్లి వివాహంపై గట్టిగా నిలదీయడంతో ఆమెను నాగరాజు చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడని ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి తల్లి సిర్పంగి రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్తీ కల్లు తయారీ ముడిసరుకు పట్టివేత



పట్టుబడిన ముడిసరుకును చూపుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నార్కట్‌పల్లి: కల్తీ కల్లు తయారీకి ఉపయోగించే ముడిసరుకును ఆటోలో తరలిస్తుండగా మంగళవారం రాత్రి నార్కట్‌పల్లి బైపాస్ వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం నల్లగొండ ఎక్సైజ్ సీఐ బుర్ర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కట్టంగూర్‌కు కల్తీ కల్లు తయారీకి ఉపయోగించే ముడిసరుకును ఆటోలో తీసుకెళ్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో మంగళవారం రాత్రి నార్కట్‌పల్లి బైపాస్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేసి పట్టుకున్నారు. ఆటోలో 30 కిలోల కోరల్‌హైడ్రేట్‌తో పాటు ఇతర ముడిసరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. కట్టంగూర్ నుంచి ఈ ముడిసరుకును సూరత్, గుజరాత్‌కు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. నల్లగొండ మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జెరిపోతుల వెంకన్నపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీఆర్‌ఎస్ సమావేశంలో జేబు దొంగల చేతివాటం

మోత్కూరు: మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన మోత్కూరు, అడ్డగూడూరు మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఆయా మండలాల నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ముఖ్య నాయకులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశం అనంతరం భోజనం సమయంలో కార్యకర్తలు ఒకేసారి గుంపులుగా వచ్చారు. ఈ క్రమంలో జేబు దొంగలు కార్యకర్తల జేబుల్లో ఉన్న నగదు దోచుకున్నారు. అనాజిపురం గ్రామానికి చెందిన నల్ల నర్సింహ నుంచి రూ.2వేలు, డి.రేపాకకు చెందిన బండారు స్వామి నుంచి రూ.1600, అదే గ్రామానికి చెందిన శ్యామల ఎల్లయ్య నుంచి రూ.5000, బొడ్డుగూడెం గ్రామానికి చెందిన దండంపల్లి సోమయ్య నుంచి రూ.1200 నగదును దొంగలు తస్కరించారు.

దొడ్డా పద్మ ఆశయాలు సాధించాలి



పద్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కూనంనేని, పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం



పాడె మోస్తున్న సీపీఐ జాతీయ, రాష్ట్ర మహిళా నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- చిలుకూరులో ముగిసిన పద్మ అంత్యక్రియలు

చిలుకూరు: హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య సతీమణి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు దొడ్డా పద్మ ఆశయాలను సాధించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం చిలుకూరులో దొడ్డా పద్మ భౌతికకాయానికి కూనంనేని సాంబశివరావు నివాళులర్పించి ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమయంలో తన భర్త దొడ్డా నర్సయ్యతో కలిసి నల్లమల్ల అడవుల్లో మూడేళ్లు పాటు పద్మ అజ్ఞాతవాసం చేసిందని, కొరియర్‌గా కూడా సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. పార్టీ నాయకులు దొడ్డా పద్మమ్మను స్ఫూర్తిగా తీసుకొని ఆమె ఆశయసాధనకు కృషి చేయాలని అన్నారు. దొడ్డా పద్మ మృతి సీపీఐకి తీరని లోటని అన్నారు. దొడ్డా పద్మ మృతి పట్ల సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్, పార్టీ జాతీయ నాయకులు పశ్య పద్మ, పోటు కళావతి, సీపీఐ సూర్యాపేట, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, దండి సురేష్, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తెల సృజన, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, ప్రముఖ వైద్యుడు జాస్తి సుబ్బారావు, మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, ధనుంజయ నాయుడు, మేకల శ్రీనివాస్, ఉస్తెల నారాయణరెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, లతీఫ్, బత్తిని హనుమంతరావు, దేవరం మల్లేశ్వరీ, గుండు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం..

దొడ్డా పద్మ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణం తీవ్ర ఆవేదనను కలిగించిందని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, పద్మ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదే విధంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఫోన్‌లో పద్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. పద్మ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పుల్‌చింతల



చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు సాగర్ నుంచి టెయిల్‌పాండ్ మీదుగా ఇన్‌ఫ్లో ఎక్కువగా వస్తుండటంతో బుధవారం 12 గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. – మేళ్లచెరువు

నాణ్యమైన ఉత్పత్తుల ఎగుమతితో అధిక లాభాలు

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు యాకాద్రి
- కేవీకే కంపాసాగర్‌లో రైతులకు పంటల ఎగుమతులపై శిక్షణ



అధిక సాంద్రత పత్తి సాగును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

త్రిపురారం: రైతులు పంటల సాగులో ఉత్తమ పద్ధతులు పాటించి నాణ్యమైన ఉత్పత్తులను ఎగుమతులు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయం విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు ఎం. యాకాద్రి అన్నారు. బుధవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో జిల్లాలోని రైతులకు వ్యవసాయ మరియు ఉద్యాన పంటల ఎగుమతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు అధిక సాంద్రత పత్తి సాగుపై దృష్టి సారించాలని, మెట్ట వరి సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణను వినియోగించుకోవాలన్నారు. అనంతరం త్రిపురారం, మర్రిగూడెం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మెట్ట వరి సాగు అలాగే తిప్పర్తిలో సాగు చేసిన అధిక సాంద్రత పత్తి సాగును పరిశీలించి కేవీకే శాస్త్రవేత్తలకు పలు సూచనలు చేశారు. మెట్ట పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్, సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, ఉద్యానవన శాస్త్రవేత్త హిమబిందు, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అంగన్‌వాడీలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పెరటి తోటల పెంపకంపై అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త డి. నరేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, పిల్లల్లో పోషక ఆహార సమస్యలు, దానికి అవసరమైన పోషక విలువలు గల పెరటి తోటల పెంపకంపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పోషకాలు సమృద్ధిగా ఉండే పెరటి తోటల పెంపకం ఎలా చేయాలో వివరించారు. అనంతరం తొమ్మిది రకాలు కూరగాయల సీడ్ కిట్స్‌ను అంగన్‌వాడీ టీచర్లకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్. నరేష్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్. సుగంధి, హుజూర్‌నగర్ సీడీపీఓ వెంకటలక్ష్మి, మండల ఇన్‌చార్జి రేవతి, కేవీకే శాస్త్రవేత్త అక్షిత్ పాల్గొన్నారు.

ఒకేసారి రెండు పనులు



రామన్నపేట: వ్యవసాయంలో యాంత్రీకరణ ద్వారా రైతులకు సమయంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయి. చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో మినీ ట్రాక్టర్ల యజమానులు కల్టివేటర్‌కు రేకు డబ్బా ఏర్పాటు చేసి ఏకకాలంలో పత్తిచేనులో దంతె తోలడం, మొక్కలకు ఎరువు పెట్టే పనులు చేస్తున్నారు. ఎకరాకు రూ.1000 చొప్పున అద్దె వసూలు చేస్తున్నారు. మినీ ట్రాక్టర్‌ను ఉపయోగించడం వల్ల రైతుకు ఎకరాకు రూ.1000 వరకు ఆదా అవుతుంది.

భార్యపై కొడవలితో భర్త దాడి

భువనగిరి: అనుమానంతో భార్యపై కొడవలితో భర్త దాడి చేశాడు. ఈ ఘటన భువనగిరి మండలం రాయగిరి గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం గ్రామానికి చెందిన నాగబోయిన లావణ్యకు రవితో 2009లో వివాహం అయ్యింది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా గత మూడేళ్లుగా లావణ్య భర్తకు దూరంగా తన తల్లిగారి ఇంట్లో ఉంది. అక్కడి నుంచి 10 నెలల క్రితం భువనగిరి మండలం రాయగిరి గ్రామానికి వచ్చి అద్దె ఇంట్లో పిల్లలతో కలిసి నివాసం ఉంటోంది. ఈ క్రమంలో శంకర్ అనే వ్యక్తితో సహజీవనం సాగిస్తుందనే అనుమానంతో భర్త రవి బుధవారం లావణ్య ఉండే ఇంటి వద్దకు వచ్చాడు. అప్పటికే శంకర్ అక్కడి నుంచి తప్పించుకుకోవడంతో భార్య లావణ్యపై రవి కొడవలితో దాడి చేశారు. దీంతో ఆమె కాలుకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లావణ్యను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

మూడు రోజుల తర్వాత ముగిసిన అంత్యక్రియలు

భువనగిరి: గొడ్డలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మూడు రోజుల క్రితం మృతిచెందిన వ్యక్తి అంత్యక్రియలు ఎట్టకేలకు బుధవారం నిర్వహించారు. వివరాలు.. భువనగిరి మండలం వడపర్తి గ్రామానికి చెందిన తోటకూరి భాను(32)పై ఈ నెల 22న అదే గ్రామానికి చెందిన తోటకూరి మల్లేష్ గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 28న భాను మృతిచెందాడు. భాను మృతునికి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం భువనగిరి-జగదేవ్‌పూర్ రోడ్డుపై ధర్నా చేశారు. పోలీసులకు సర్దిచెప్పడంతో ధర్నా విరమించుకున్నారు. కానీ తమకు న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు నిర్వహించబోమని చెప్పడంతో గ్రామపెద్దలు, పోలీసులు వారికి నచ్చజెప్పడంతో ఎట్టకేలకు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ పశువుల సంతలో 9 గోవులను కొనుగోలు చేసి బొలేరో వాహనంలో హైదరాబాద్‌లోని బహదూర్‌పురాకు తరలిస్తుండగా.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. పట్టుబడిన గోవులను గోశాలకు తరలించారు. బొలేరో డ్రైవర్ సట్టు సందీప్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

సాగర్ ఎడమ కాలువలో యువకుడి గల్లంతు

మిర్యాలగూడ టౌన్: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు సాగర్ ఎడమ కాలువలో గల్లంతయ్యాడు. ఈ ఘటన బుధవారం మిర్యాలగూడ మండలం తక్కెళ్లపహాడ్ తండా సమీపంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపహాడ్ గ్రామానికి చెందిన చౌగాని శంకర్(38) తన స్నేహితులు మల్లేపల్లి రాకేష్, మణి, నగేష్‌తో కలిసి తక్కెళ్లపహాడ్ తండా సమీపంలో గల నాగార్జునసాగర్ ఎడమ కాలువకు ఈతకు వెళ్లారు. శంకర్‌కు ఈత సరిగా రాకపోవడంతో కాలువ మెట్లను పట్టుకొని ఈత కొడుతుండగా.. నీటి ప్రవాహానికి పట్టుతప్పి కాలువలో పడిపోయాడు. అదే సమయంలో కాలువలో ఈత కొడుతున్న తన స్నేహితుడు మల్లేపల్లి రాకేష్ శంకర్‌ను రక్షించే ప్రయత్నం చేయగా అతడు కూడా నీటి ప్రవాహానికి కొట్టుకుపోతూ కేకలు వేశాడు. సమీపంలో పొలం పనులు చేస్తున్న జంకుతండాకు చెందిన వారు మల్లేపల్లి రాకేష్‌ను రక్షించారు. శంకర్‌ను కూడా రక్షించే ప్రయత్నం చేసినప్పటికి పూర్తిగా నీటిలో మునిగి గల్లంతయ్యాడు. శంకర్ మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని శంకర్ కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి

రాజాపేట: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన రాజాపేట మండలం దూదివెంకటాపురంలో బుధవారం జరిగింది. దూదివెంకటాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గొడిశెల శ్రీరాములు(48) బుధవారం కల్లు గీసేందుకు గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కగా.. మోకు జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న గీత కార్మికులు గుర్తించి శ్రీరాములు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.